# సిగ్గు

అప్పుడు స్టూడియోలో 'పతివ్రత' అనే చిత్రం షూటు అవుతూవుంది. ఎండలు తీవ్రంగా ఉంటంవల్ల రాత్రిపూట షూటింగు...

గోపీ మేకప్‌రూం ముందు నుంచోని మురళి వేసుకున్న దుస్తులు, ధరించిన ఆభరణాలు సరిగ్గా వున్నవో లేవో చూస్తున్నాడు. డైరక్టరు సెట్టుమీాదనుంచి మేకప్ - గదిలోకీ, మేకప్ గదిలోనుంచి ఆఫీసు గదిలోకి, ఆర్డర్లిస్తూ తిరుగుతున్నాడు.

అంతా హడావడిగా వుంది.

"ఊఁ... కానివ్వండి." అన్నది మురళి.

గోపీ చదివి వినిపిస్తున్నాడు:—

"నాలుగు గిల్టుగాజులు"

"ఊఁ—"

"చెవులకు పొడుగాటి లోలకులు"

"ఊఁ—" లోలకులు మెరసినవి.

"చెట్టు రెమ్మల లంగా"

"ఇదిగో"

"పువ్వుల జాకెట్టు"

ఆమె నవ్వాపుకోలేక పోయింది. "జాకెట్టు కొలతలుకూడా రాసుకోలేకపొయ్యారా ?" అన్నది. గోపీ నవ్వి, "ఆ రోజులూ వస్తవి. ఈ పుస్తకం పెన్సలతోపాటు టేపుకూడా తెచ్చుకుంటే సరిపోతుంది." అన్నాడు.

ఆమె నవ్వింది.

గోపీ ఆమెను సంభాషణలోకి దింపటానికి ప్రయత్నించాడు —"సరేగాని నిన్న..."

డైరెక్టరు సెట్‌మీద నుంచి "ఆర్టిస్టులు" అని కేక పెట్టాడు. స్టూడియో ప్రతిధ్వనించింది.

ఆమె గాభరాగా, "నేను వెళ్తాను. ఆలస్యమైతే కోప గిస్తారు." అని చెప్పి రివ్వున పరిగెత్తింది.

అతడు మాత్రం అలాగే నిలబడ్డాడు.

చెట్టురెమ్మల లంగా కాళ్ళకు కొట్టుకుంటూ పరుగెత్తుకొని పోతున్న మురళిని చూస్తూ, 'అవును కోపగిస్తారు... మురళిని కూడా కోపగిస్తారు.' అనుకొని నిట్టూర్చాడు.

గోపీకి సినిమా జీవితం కొత్త—

అదో గాలిలో వచ్చిపడ్డాడు. అనుకున్నంత త్వరగా ఈ నాగరికతకు అలవాటు పడలేక పోయాడు. అందరినీ కొత్తగా చూసేవాడు—అందరూ విచిత్రంగా చూసేవారు. ఎవ్వరూ అతనితో మాట్లాడేవారు కారు. అందర్నీ అతడు......ఒక్క మురళి మాత్రం మొదట్నుంచీ అతనితో కులాసాగా మాట్లాడు తుండేది; కిలకిల నవ్వేది; హాస్యంచేసేది; మెరిసిపోయేది.

"మురళే లేకపోతే..."

ప్రొడక్షన్ మేనేజరు వచ్చాడు. అడిగాడు.

"మీ రింకా ఇక్కడే ఉన్నారే?"

"ఆలోచిస్తున్నాను."

"మీ రట్లాగే చెపుతారు. అక్కడేమో ఆయన మమ్మల్ని గూటేస్తున్నాడు."

"ఎవరు, డైరక్టరుగారా?"

"ఇం కెవ్వరు ?"

"పిలిచారా ?"

"పిలవాలటండీ ?"

గోపీ సెట్‌మీదకు వెళ్ళాడు. షూటింగు ప్రారంభమైంది. డైరెక్టరు మురళితో, 'ఇలా చెయ్యి అలా చెయ్యి' అని చెపుతున్నాడు. కెమారామన్ కెమారా అరేంజ్ చేస్తున్నాడు. సౌండు ఇంజనీయరు నాలుగైదు టెస్టులు తీసుకుని 'ఓ. కే'అని కేక వేశాడు.

గోపీ పోయి మురళిని చూస్తూ నిలబడ్డాడు.

డైరెక్టరు: "ఇప్పటిదాకా ఏంచేస్తున్నావ్ ?" డైరెక్టరు చుట్టూ ఉన్న అందరూ, గోపీవంకకు చూశారు.

అతడు అలాగే మురళిని చూస్తూ: "తరువాత మాట్లాడుదాం." అన్నాడు డైరెక్టరుతో.

డైరెక్టరు క్రోధంగా చూశాడు... అవతలకు వెళ్ళాడు. గోపీ మురళితో జాలిగా, "పాపం! నిన్న బాగా వడతగిలివుంటుంది." అన్నాడు—నిన్న మండుటెండలో షూటింగు జరిగింది. మురళి ఆ ఎండలో తిరగటం గోపీ చూడలేకపోయాడు. కాని ఏంచేస్తాడు? చివరకు సందుచేసుకొని పైవిధంగా ప్రశ్నించాడు.

ఆమె క్లుప్తంగా జవాబు చెప్పింది:— "డైరెక్టరుగారి నడగండి."

డైరెక్టరు వాళ్ళసంభాషణ చూశాడు. గోపీవల్ల షూటింగు ఆలస్యమవటం తెలుసుకున్నాడు. "ఇవతలికిరా" అని కేక వేశాడు.

గోపీ హఠాత్తుగా డైరెక్టరు వంక తిరిగి, "నిన్నమురళికి వడ

తగిలింది." అన్నాడు.

అందరూ ఆశ్చర్యపడ్డారు. ఇంతవరకూ గోపీ ఎప్పుడూ ఆ విధంగా మాట్లాడి ఎరుగడు. అతనిమాటలు అతనికే విచిత్రంగా ధ్వనించినవి. డైరెక్టరు విసుక్కున్నాడు...

మ్యూజిక్ డైరెక్టరు 'మాన్షియర్ ఫ్లువొలషీకుపోజ్' పెట్టి తయారుగా నిలబడ్డాడు—

మురళి: "మీరు కొంచం దూరంగా ఉండురూ. ప్రక్కన ఉంటే ఏమిటోగా ఉంటుంది." అన్నది.

గోపీ అవతలకి వెళ్ళాడు...

ఆ సీను షూటింగు పూర్తి అయింది. మురళి ఏవిధంగా నటించిందో అతనికి తెలియదు. అతడు చూశాడు; చూడలేదు. పాటవిన్నాడు; వినలేదు. డైరెక్టరు మాత్రం భుజం తట్టి "సెభాస్" అన్నాడు మురళిని.

ఒక్క పది నిమిషాలు ఆర్టిస్టుకు విశ్రాంతి ఇచ్చాడు—

మురళి మేకప్ గదిలోకి వెళ్ళటానికి సర్దుకుంటూ ఉంది. గోపీ ముందు బయల్దేరాడు. సెట్ దాటి బయటికివచ్చేటప్పటికి అంతా చీకటి. అలాగే అడుగులు వేశాడు. అటు తిరుగుతూ ఇటు తిరుగుతూ, ఆలోచిస్తున్నాడు—

"ఈ మురళే లేకపోతే నేనేమై పోయేవాణ్ని ?...ఎందుకీ పిచ్చిపిల్లకు నేనంటే ఇంత ప్రేమ...వీరందరూ నిరాదరణ చూపిస్తున్నారని నామీద జాలా ?...నాలో ఈమె ప్రేమను కదిలించటానికి ఏముంది?"

అతని బుజాలమీద చేతులు పడ్డవి— వెనక్కు తిరిగాడు— చెంపకు చెంప ఆనింది.

"ఇప్పటికి!" అన్నది.

పెదవులు కలిసినై!

"అమ్మయ్యో!" అన్నది.

పారిపోయింది.

గోపీకిఅయోమయం... "ఎవరు?" అలాగేనిలబడిపోయాడు. ఎవరామె?.. మొదట్లో తనమీద తనకే అసహ్యం వేసింది. ఎవరో తనని ఎవరిగానో భ్రమపడి ఈ పని చేశారు! అతని క్రింది పెదవి చిమ్‌చిమ్‌లాడింది.

ఎవరు?

ఆలోచించాడు.

భానుమతి కాదు; నలభై సంవత్సరా లెక్కడివి?... శ్యామల కాదు; బూరిబుగ్గలు... ఆ దాసీ అసలే కాదు...

మరి ఎవరీమె?

గోపీ అంతరాత్మ చెప్పింది—"ఇంకెవరు? మురళే!"

"ఆఁ... మురళి, నామురళే!" అతనిరక్తనాళాలుఉప్పొంగినై. ఆ ముంగురులు—ఆ వేడి ఊర్పులు—మురళే! మైమరచాడు. చెంగున గంతు వేశాడు—ఈమధ్య ఉదరం పెరిగిందనే సంగతి కూడా మరచిపోయాడు — సెట్టుమీదకు పరిగెత్తాడు. అక్కడ మరొక సీను షూటింగు ప్రారంభం అయింది. మురళీ, మరి కొందరు నటీమణులూ ఉన్నారు.

గోపీ కనుపించిన ప్రతి వ్యక్తినీ కులాసాగా పలుకరించాడు-భానుమతిని చూచి, "నీ కండ్లు చాలాబాగున్నవి", అన్నాడు-శ్యామలను చూచి "అద్భుతం" అన్నాడు - దాసీని చూచి చిటికవేశాడు—మురళితో, "కండ్లు ఇలా తిప్పాలి సుమా."

అన్నాడు.

ఇదంతా డైరెక్టరు చూశాడు. గోపీ తరహా చూచి ఏమీ అనలేక ప్రొడక్షన్ మేనేజర్ని తిట్టాడు.

గోపీ అయిదు నిమిషాలు సుడిగుండంలా తిరిగాడు - కెమేరాకు అడ్డువచ్చాడు. సౌండు ఇంజనీయరుకు అడ్డు వచ్చాడు. లైట్లకు అడ్డువచ్చాడు. గబగబా కెమేరా దగ్గరకువెళ్ళి 'వ్యూ ఫైండర్లో' నుంచి తదేకధ్యానంగా మురళిని చూస్తున్నాడు.

డైరెక్టరు ఊరుకోలేకపోయాడు, "కెమేరాచుట్టూ మూగ వద్దు. అడ్డంలే" అని కేకవేశాడు.

గోపీ కదలకుండానే "కాస్త" అన్నాడు...

ఆ సీనుకూడా షూటింగు పూర్తిఅయింది. మురళివస్తువులు సర్దుకుని గదిలోకి వెళ్తున్నది. గోపీ చూశాడు. తానూ బయల్దేరాడు.

డైరెక్టరు పిలిచాడు.

గోపీ వినిపించుకోలేదు.

"గోపీ" గద్దించాడు డైరెక్టరు.

"ఉండవయ్యా"

తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు...

అదే స్థలం! అదే చీకటి!!! మురళి గబగబా తన గది వైపు వెళ్తున్నది.

బుజాలమీాద చేతులు పడ్డవి - వెనక్కు తిరిగింది - చెంపకు చెంప ఆనింది - పెదవులు కలిసినై.

ఒక్క క్షణం...

చటుక్కున చెంపమీాద కొట్టింది.

డైరెక్టరు దగ్గరకు పరుగెత్తింది.

గోపీ స్తంభించిపోయాడు. గుటకలు మింగుతూ చెంపమీద చేయిపెట్టుకుని నిలబడిపోయాడు...ఆలోచించాడు....ఆలోచించాడు...తన వూరికి రైలెప్పుడు?

డైరెక్టరు, "గోపీ?" అని పిలిచాడు. అతడు పారిపోదామనుకున్నాడు. డైరెక్టరు మళ్ళీ పిలిచాడు. ప్రొడక్షన్ మేనేజరు వచ్చాడు. "వారు అంత సేపట్నుంచీ పిలుస్తుంటే కదలేం?" అన్నాడు.

గోపీ నెమ్మదిగా బయల్దేరాడు.

డైరెక్టరు పక్కనే కూర్చుని ఉంది మురళి. చుట్టూ టెక్నీషియన్లు కూర్చున్నారు. గోపీ కృతనిశ్చయుడై వెళ్ళాడు. డైరెక్టరు అతన్ని తేరిపార చూశాడు.

"ఈమెను ఇంటిదగ్గర దింపిరా!" అన్నాడు.

గోపీ తికమక పడ్డాడు.

డైరెక్టరు ప్రొడక్షన్ మేనేజరుతో "కారు పంపించు." అన్నాడు. గోపీ మురళి క్రీగంట చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. డైరెక్టర్ని చూచాడు. అతడు గోపీ అవస్థను గ్రహించినట్లుగా "ఈ పరిశ్రమలో సిగ్గుపడితే ఎట్లా?" అన్నాడు.

"అబ్బె లేదండీ!" సర్దుకుంటూ జవాబుచెప్పాడు.

డైరెక్టరు నవ్వాడు—

మురళి లేచింది—

కారు వచ్చింది.